సాక్షి
పల్నాడు
మంగళవారం ¦ 21 ¦ మే ¦ 2024



వైభవంగా కలశాభిషేకం

బాపట్ల: శ్రీ భావపురి శ్రీనివాస శ్రీ విఖనస ఆశ్రమంలో లోక కల్యాణార్థం సోమవారం మహాశాంతి పూర్వక అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు.



రంగనాథుడి కల్యాణ ఉత్సవాలు

యడ్లపాడు: సొలసలోని భూ సమేత రంగనాయకస్వామి ఆలయంలో సోమవారం శ్రీలక్ష్మీ అమ్మవారికి 54 రకాల వస్తువులతో పూజలు నిర్వహించారు.

ముగిసిన బండ్లమ్మ కొలుపులు



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులో శ్రీబగళాముఖి బండ్లమ్మ అమ్మవారి కొలుపులు ఆదివారం రాత్రి ముగిశాయి. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

న్యూస్‌రీల్

గుంటూరు రేంజ్ ఐజీని కలిసిన పల్నాడు ఎస్పీ



నగరంపాలెం(గుంటూరు): గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ మర్యాద పూర్వకంగా కలిశారు. గుంటూరు నగరంలోని ఐజీ కార్యాలయంలో ఐజీని కలిసి మొక్క అందించారు. ఎన్నికల నేపథ్యంలో పల్నాడు జిల్లాకు ఎస్పీగా మలికా గార్గ్ బదిలీ అయిన విషయం విదితమే.

ప్రశాంత వాతావరణంలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు




నరసరావుపేట: ఈనెల 24వ తేదీ నుంచి జూన్ ఒకటో తేదీ వరకు నిర్వహించే ఇంటర్మీడియేట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరగాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి ఎం.నీలావతి, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎం.నీలావతి మాట్లాడుతూ మొదటి ఏడాది జనరల్, వృత్తి విద్యా విద్యార్థులు 10,157 మంది(ఇంప్రూవ్‌మెంట్, ఫెయిల్), రెండో ఏడాది ఫెయిలైన విద్యార్థులు 4,778 మంది కలిపి మొత్తం 14,935 మందికి పరీక్షలకు హాజరవుతారని, 26 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేశామన్నారు. ఏదైనా సమస్య ఉంటే 08647-223355కు ఫోన్‌చేసి చెప్పాలని కోరారు. డీఆర్వో వినాయకం, మున్సిపల్ కమిషనర్, డీఈఓ, ఏపీఎస్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్, డీఎంహెచ్‌వో, ఏపీఎస్‌ఆర్టీసీ రీజనల్ మేనేజర్, పోస్టాఫీసు సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

ఈవీఎంల ధ్వంసం కేసులో 10 మంది అరెస్టు

రెంటచింతల: మండలంలోని రెండు గ్రామాలలో ఈనెల 13న నిర్వహించిన పోలింగ్ సందర్భంగా బూత్‌లలోని ఈవీఎంలను ధ్వంసం చేసిన ఘటనలోని 10 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు సోమవారం తెలిపారు. తుమృకోట గ్రామంలో ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో టీడీపీకి చెందిన పొట్ల సతీష్, జంగాల కోటేశ్వరరావు, మిద్దెపోగు మహేష్, జంగాల సైదులు, జెట్టిపాలెం గ్రామంలో ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించి వైఎస్సార్ సీపీకి చెందిన కుందురు నర్సింహారెడ్డి, మేకపోతుల శివారెడ్డి, కేతావత్ మంగ్లానాయక్, కొండా రామయ్య, తిక్కా శ్రీనివాస రావు, పేర్ల శివరామ్‌లను నర్సరావుపేట పీడీఎం కోర్టులో హాజరుపెట్టినట్లు వెల్లడించారు.

వైభవంగా నృసింహస్వామి జయంత్యుత్సవాలు



మంగళగిరి: పట్టణంలోని లక్ష్మీనృసింహస్వామి జయంత్యుత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు సోమవారం ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ఠ నరసింహమూల మంత్ర హోమం, సాయంత్రం ఆరు గంటలకు విష్వక్సేన పూజ, అగ్నిప్రణయనం, కుమ్భారాధన నారసింహ హోమం పూజలు చేశారు. అనంతరం స్వామికి గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 504.80 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 806.60 అడుగుల వద్ద ఉంది.

పచ్చ రాక్షసం

మాచర్ల టార్గెట్‌గా 'దేశం' ఆపరేషన్ దమనకాండ

- మద్దతుగా నిలిచిన పోలీసు అధికారులు
- స్పందించని నాటి జిల్లా కలెక్టర్
- ఎన్నికలు ముగిసిన తర్వాత ఘర్షణలకూ వారే కారణం
- సిట్ బృందానికి ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ





ఎన్నికల సందర్భంగా రెంటచింతల మండలంలో జరిగిన టీడీపీ మూకల దాడుల్లో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: మాచర్లలో జెండా పాతడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ చేసిన ఆపరేషన్‌కు పోలీసు ఉన్నతాధికారులు, సర్కిల్ అధికారులు అండగా నిలిచారు. పోలింగ్ రోజు, తదనంతరం అక్కడ జరుగుతున్న పరిణామాలపై ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేస్తున్నా డీఐజీ గానీ, అప్పటి ఎస్పీ గానీ, కలెక్టర్‌గానీ స్పందించకపోవడం దీన్ని బలపరుస్తోంది. తెలుగుదేశం పార్టీ తమ సామాజిక వర్గం అధికంగా ఉన్న గ్రామాల్లో మొదటి నుంచి వ్యూహాత్మకంగా రిగ్గింగ్ చేయడానికి సన్నాహాలు చేసుకుంది. చివరి నిముషంలో అదే సామాజిక వర్గానికి చెందిన అధికారినీ తీసుకురావడంతో ఆ పార్టీ నేతలు మరింత రెచ్చిపోయారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల తర్వాత కూడా మాచర్ల రణరంగంగాన్ని తలపించింది. టీడీపీ కుట్రలు, కుయుక్తులపై వైఎస్సార్ సీపీ బృందం సోమవారం ఎన్నికల సంఘం నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం(సిట్) అధినేత వినీత్ బ్రిజ్‌లాల్‌కు ఫిర్యాదు చేసింది.

ఫ్యాక్షన్ జూలు విదిల్చిన జూలకంటి

జూలకంటి బ్రహ్మానందరెడ్డిని టీడీపీ మాచర్ల ఇన్‌చార్జిగా ప్రకటించినప్పటి నుంచి అక్కడ మళ్లీ ఫ్యాక్షన్ ఊపిరి పోసుకుంది. ఎప్పుడైతే ఆయనను టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిందో అప్పటి నుంచి నియోజకవర్గంలో ఆయన సమస్యలు సృష్టించడం మొదలుపెట్టారు. మాచర్లను కైవసం చేసుకోవాలంటే పల్నాడు జిల్లాలో అప్పుడు ఉన్న ఐజీ, ఎస్పీ ఇతర అధికారులు ఉంటే సాధ్యం కాదని జూలకంటి, టీడీపీ అధినాయకులు గుర్తించారు. దీంతో వారు ఆ ఎస్పీని టార్గెట్‌గా చేసుకున్నారు. ఆయన ఉంటే బూత్ క్యాప్చర్, ఓటర్లను భయపెట్టడం కుదరని అభిప్రాయపడ్డారు. అప్పుడే పొత్తు పెట్టుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి ద్వారా పావులు కదిపారు. జిల్లాలో రెడ్డి, ఎస్సీ అధికారులు ఉంటే తమ పన్నాగం పారదని, వారిని మార్చాలని ఒత్తిడి తీసుకువచ్చారు. ఐజీ పాల్‌రాజ్‌ను బదిలీ చేసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించకపోయినా గత తెలుగుదేశం ప్రభుత్వంలో చక్రం తిప్పిన ఒక అధికారికి సన్నిహితంగా ఉండే అధికారిని తీసుకువచ్చి పోస్టింగ్ ఇప్పించారు. పల్నాడు ఎస్పీగా గతంలో సెబ్ అడిషనల్ ఎస్పీగా పనిచేసిన బిందుమాధవ్‌ను తీసుకువచ్చారు. వారు వచ్చిన తర్వాత కిందిస్థాయి సిబ్బందికి తెలుగుదేశం నాయకులను టచ్ చేయవద్దంటూ మౌఖిక ఆదేశాలు వెళ్లాయి.

పేట్రేగిపోయిన పచ్చమూకలు

11న రెంటచింతలకు వెళ్లిన సీఐ నారాయణస్వామి తెలుగుదేశం నేతలకు మీ ఇష్టం వచ్చినట్లు ఎన్నిక నిర్వహించుకోండని చెప్పినట్లు సమాచారం. దీంతో టీడీపీ నేతలు పేట్రేగిపోయారు. అదేరోజున కారంపూడి మండలం వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డిపై దాడి చేసి బెదిరించారు. వేపకంపల్లిలో తెలుగుదేశం నేతలు మహేష్ అనే వ్యక్తిపై ఆరోపణలు చేసి అతనిపై దాడి చేస్తే తొలుత ఒక హెడ్ కానిస్టేబుల్‌ను పంపారు. ఆ తర్వాత సీఐ వెళ్లి మహేష్‌ను కరెంట్ స్తంభానికి కట్టేయించి అవమానించారు. 12న రెంటచింతలలో నారాయణస్వామి ఉండగానే తెలుగుదేశం నేతలు మోర్తాల ఉమామహేశ్వరరెడ్డిపై దాడి చేశారు. రెంటచింతల మండలం పాలువాయిగేట్ పోలింగ్‌స్టేషన్ 201,202 వద్ద టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ ఏజెంట్లనూ అనుమతించలేదు. తొమ్మిది గంటల సమయంలో ఐజీ శ్రీకాంత్ జోక్యంతో ఏజెంట్లను అనుమతించారు. జెట్టిపాలెంలో 214, 217 పోలింగ్ బూత్‌లలోకి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లను అనుమతించలేదు. దీనిపై గ్రామస్తులు ప్రశ్నించినప్పుడు సీఐ నారాయణస్వామి వచ్చి వైఎస్సార్ సీపీ ఏజెంట్లను భయపెట్టి బయటకు పంపారని గ్రామస్తులు చెబుతున్నారు. తుమృకోటలో టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడినప్పుడు ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈవీఎంలూ ధ్వంసమయ్యాయి. ఆ తర్వాత కొత్త ఈవీఎంలు పెట్టి వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు లేకుండానే ఎన్నిక కొనసాగించారు. వెల్దుర్తిలోని 137, 138, 139, 140, 141 పోలింగ్ స్టేషన్లలో రాత్రి ఏడు గంటల తర్వాత వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బయటకు పంపి రిగ్గింగ్ చేశారు. దీనిపై ఎస్పీకి ఫిరాదు చేసినా స్పందించలేదు. ఒప్పిచర్లలో 250,251,252, 256 పోలింగ్ స్టేషన్లలో ఇతర సామాజిక వర్గాల వారు ఓటు వేసుకోలేని పరిస్థితి నెలకొంది.

'నారా'యణస్వామి భక్తి

కారంపూడి సర్కిల్‌లో కారంపూడి, రెంటచింతల, దుర్గి పోలీసుస్టేషన్లు ఉన్నాయి ఇక్కడ బీసీ వర్గానికి చెందిన సీఐ చినమల్లయ్య సమర్థంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతన్ని అర్ధంతరంగా ఎన్నికల ముందు బదిలీ చేశారు. ఆయన స్థానంలో తమ సామాజిక వర్గానికి చెందిన నారాయణస్వామిని తీసుకువచ్చి అక్కడ పోస్టింగ్ ఇప్పించుకున్నారు తెలుగుదేశం నాయకులు. ఆయన వచ్చీరాగానే తన సామాజికవర్గ నాయకులకు పగ్గాలు ఇచ్చేశారు. ఎన్నికల్లో మీరు ఎలాగైనా పనిచేసుకోవచ్చని తెలుగుదేశం పార్టీలోని నాయకులకు అభయం ఇచ్చేశారు. ఆయన ఫోన్ కాల్, వాట్సప్, ఫేస్‌టైమ్ డేటాను పరిశీలిస్తే ఆయన తెలుగుదేశం పార్టీకి ఏవిధంగా పని చేసింది అర్థమవుతుందని వైఎస్సార్ సీపీ బృందం తన ఫిర్యాదులో పేర్కొంది.

దాడులకు పాల్పడినా చర్యల్లేవు



ఈనెల 14న కారెంపూడి బస్టాండ్ వైపు దూసుకు వస్తున్న టీడీపీ మూకలు

వెల్దుర్తి పరిధిలో కొందరు టీడీపీ నేతలు పోలీసు కానిస్టేబుళ్ల మీద చేయి చేసుకున్నట్లు ఫిర్యాదు రిజిస్టర్ అయినా దాడి చేసిన వారిని కనీసం స్టేషన్‌కు కూడా పిలవలేదు. ఎన్నికల ముందు బైండోవర్ కూడా చేయలేదు. ఎన్నికలకు మూడు రోజుల ముందు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భార్య శిరిగిరిపాడు గ్రామంలో ప్రచారం చేస్తుండగా ఆమెపై దాడి చేశారు. బందోబస్తుగా వచ్చిన ఎస్‌ఐ ఇతర పోలీసు సిబ్బందిపై కూడా తెలుగుదేశం నేతలు దాడి చేశారు. దీనిపై రెండు ఫిర్యాదులు వచ్చినా దాడి చేసిన వారిని ఎవరినీ పోలీసుస్టేషన్‌కు పిలవలేదు. పైగా బాధితుడైన ఎస్‌ఐతోపాటు కారంపూడి, మాచర్ల టౌన్ సీఐలను బదిలీ చేశారు. దీంతో పోలీసుల్లో అభద్రతా భావం ఏర్పడింది. దీన్ని అడ్డం పెట్టుకుని తెలుగుదేశం నాయకులు గ్రామాల్లో రెచ్చిపోయారు. రెంటచింతలలో సుమారు రెండు లక్షల హోలోగ్రామ్ ఉన్న ఓటర్ స్లిప్‌లను స్వాధీనం చేసుకుంటే కలెక్టర్ చర్యలు తీసుకోకపోగా బస్‌ను కూడా సీజ్ చేయకుండా వదిలేశారు. ఈ మొత్తం వ్యవహారంలో ఎస్పీ బిందు మాధవ్‌తోపాటు కొంతమంది అధికారులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకున్నా. ఎన్నికల్లో ఏకపక్షంగా వ్యవహరించిన మరికొందరు అధికారులను కొనసాగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వహిస్తాం

- పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే నిర్వహించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్, పక్కన జేసీ శ్యాంప్రసాద్, డీఆర్వో వినాయకం

నరసరావుపేట: జిల్లాలో ప్రశాంతమైన పరిస్థితులు కల్పించడంతోపాటు కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ లత్కర్ శ్రీకేష్ బాలాజీరావు చెప్పారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా సోమవారం కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల రోజు, ఆ తర్వాత జరిగిన హింసాత్మక సంఘటనల కారణంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేకమైన పరిస్థితుల్లో ఇక్కడకు వచ్చానన్నారు. కౌంటింగ్ సజావుగా నిర్వహించి అనంతరం ఎటువంటి అల్లర్లు జరగకుండా పోలీసులతో కలిసి పనిచేస్తామన్నారు. 2018లో గుంటూరులో డయేరియా ప్రబలిన సమయంలో ప్రత్యేకమైన పరిస్థితుల్లో కమిషనర్‌గా వచ్చానన్నారు. ఇప్పుడు కూడా పల్నాడుకు ప్రత్యేకమైన పరిస్థితుల్లో వచ్చానన్నారు. జిల్లాలో 27 పోలింగ్ కేంద్రాలలో మినహా మిగతా అంతా ప్రశాంతంగా జరిగిందని, ఆ 27 కేంద్రాల వద్ద జరిగిన సంఘటనల కారణంగా జిల్లాకు చెడ్డపేరు వచ్చిందన్నారు. కౌంటింగ్ సమయంలో మరోసారి జిల్లాకు చెడ్డపేరు రాకూడదన్నారు. దీనికి అందరూ సహకరించాలని కోరారు. ఇప్పటివరకు జరిగిన హింసాత్మక సంఘటనలపై కేసులు నమోదయ్యాయన్నారు. వచ్చే 14రోజుల వ్యవధిలో నియోజకవర్గాల వారీగా హింసాత్మక సంఘటనలకు పాల్పడే వారిని గుర్తించి బైండోవర్ చేస్తామన్నారు. కౌంటింగ్ హాలులో 700మంది స్టాఫ్ అవసరం ఉందన్నారు. వారందరికీ తగిన శిక్షణ ఇస్తామన్నారు. సెక్షన్ 144 వచ్చే జూన్ ఐదు వరకు కొనసాగిస్తామన్నారు. దీని వలన ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పరిశీలిస్తామన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, డీఆర్వో వినాయకం పాల్గొన్నారు.

కౌంటింగ్‌లో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకం

నరసరావుపేట: జూన్ నాల్గవ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపులో ఆయా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు కీలకపాత్ర పోషించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సార్వత్రిక ఎన్నికలు కౌంటింగ్ నిర్వహణ ఏర్పాట్లపై ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రిటర్నింగ్ అధికారులు ఆయా నియోజకవర్గాలలో శాంతిభద్రతలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, కౌంటింగ్ సమయంలో రిటర్నింగ్ అధికారి ఏ నిర్ణయం తీసుకుంటారో అదే తుదినిర్ణయంగా పరిగణిస్తారని తెలిపారు. ఎన్నికల కమిషన్ కౌంటింగ్ సంబంధించిన పలు విషయాలను పుస్తకం రూపంలో ముద్రించిందని, ప్రతి ఒక్క అధికారి దానిని క్షుణ్ణంగా చదివి పరిజ్ఞానం పొందాలని కోరారు. ఫలితాలు ప్రకటించిన అనంతరం సంబంధిత ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు పటిష్ట బందోబస్తు ద్వారా స్ట్రాంగ్ రూమ్‌లోకి చేర్చాలని అన్నారు. అందుకు అవసరమైన సిబ్బందిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని, నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు. అబ్జర్వర్, పోటీలో ఉన్న వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూమ్ ఓపెన్ చేసుకోవాలని, అందుకు అవసరమైన చురుకైన కౌంటింగ్ సిబ్బందిని నియమించుకోవాలని కోరారు. పార్లమెంట్‌కి, నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ సిబ్బంది ప్రత్యేకంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ సిబ్బందికి కూడా ప్రత్యేకమైన శిక్షణ కార్యక్రమాలు ఆయా నియోజకవర్గాల స్థాయిలో నిర్వహించాలని అన్నారు. కౌంటింగ్‌కు పాల్గొనే ప్రతి ఒక్క సిబ్బంది, వివిధ రాజకీయపార్టీల పార్టీల ఏజెంట్లు కూడా కచ్చితంగా గుర్తింపు కార్డు ఉండాలని తెలిపారు. డేటా ఎంట్రీకి చురుకైన సిబ్బందిని నియమించుకోవాలని కోరారు. మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌తోపాటు పెదకూరపాడు, సత్తెనపల్లి, చిలకలూరిపేట, వినుకొండ రిటర్నింగ్ అధికారులు శ్రీరాములు, మురళీకృష్ణ, నారదముని, సుబ్బారావు పాల్గొన్నారు.

నిందితులను 48 గంటల్లో అరెస్టు చేస్తాం

జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మలికా గార్గ్



నరసరావుపేట: ఎన్నికల సందర్భంగా నమోదైన కేసుల్లోని నిందితులను వచ్చే 48 గంటల వ్యవధిలో అరెస్టు చేస్తామని జిల్లా నూతన ఎస్పీ మలికా గార్గ్ చెప్పారు. సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించేందుకు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన ఆమె పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా జరిగిన హింసాత్మక సంఘటనల కారణంగా చండీఘర్‌లో పనిచేస్తున్న తాను ఇక్కడకు రావాల్సి వచ్చిందన్నారు. శాంతి భద్రతలను పునరుద్ధరించి కౌంటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించటమే తమ తొలి ధ్యేయమన్నారు. జిల్లాలో 144 సెక్షన్‌ను గట్టిగా అమలుచేస్తామన్నారు. శాంతిభద్రతలు మామూలు స్థితికి వచ్చేందుకు పోలీసులు తీసుకునే చర్యలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వాటికి విఘాతం కలిగించే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా పోలీసు విభాగంలో పనిచేస్తున్న వారిపై కూడా శాఖాపరమైన చర్యలకు వెనుకాడబోమని అన్నారు. అందరమూ కలిసి జిల్లా ఖ్యాతిని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవిస్తూ దానికి అనుగుణంగా వ్యవహరించాలని కోరారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ లత్కర్ శ్రీకేశ్ బాలాజీరావును మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. ఇరువురూ కొద్ది సేపు జిల్లా పరిస్థితిపై చర్చించారు.

సత్తా చాటిన బల్లికురవ ఎడ్ల జత



ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్ల జత

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని రామాపురంలో పట్టాభిరామస్వామి, గ్రామ దేవత పేరంటాళ్ల తిరునాళ్ల సందర్భంగా గ్రామానికి చెందిన నారా వీరారెడ్డి, సిద్ధమ్మ కుటుంబ సభ్యులు సోమవారం ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అంబాల చిన వెంకటరెడ్డి ప్రారంభించారు. పోటీలో మొత్తం ఐదు జతల ఎడ్లు పాల్గొన్నారు. బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామి ఎడ్లజత పందెపు రాయిని నిర్దేశిత సమయంలో 1,589 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలించింది. ప్రకాశం జిల్లా టంగుటూరు గ్రామానికి చెందిన మక్కెన కోటేశ్వరరావు ఎడ్లజత 1551.3 అడుగులతో ద్వితీయ స్థానం, గిద్దలూరు మండలం కొండపేటకు చెందిన మీనిగ కాశయ్య ఎడ్లజత 1157 అడుగులు లాగి తృతీయ స్థానంలో నిలిచాయి. బల్లికురవ పావులూరి వీరాస్వామికి చెందిన మరో జత 1023 అడుగుల లాగి నాలుగో స్థానం, నంద్యాల జిల్లా బేతంచెర్లకు చెందిన మేకల వెంకట్రాముడు ఎడ్లజత 927 అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతులు వరుసగా ప్రథమ రూ.50 వేలు, ద్వితీయ రూ.40 వేలు, తృతీయ రూ.30 వేలు, 4, 5 స్థానాల్లో నిలిచిన వారికి ప్రోత్సాహకంగా చెరో రూ.5 వేలను నారా కుటుంబసభ్యులు నారా పెద సిద్ధారెడ్డి, చిన సిద్ధారెడ్డి, బాల సిద్ధారెడ్డి, సిద్ధారెడ్డి అందజేశారు.



బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ఇసుక అక్రమ తవ్వకాలపై కొరడా

- తనిఖీలకు రెండు షిఫ్టులుగా బృందాలు
- అక్రమ తవ్వకాలు జరిగితే బాధ్యులపై కేసులు
- కొల్లిపర మండలంలో ఇసుక రీచ్‌లను తనిఖీ చేసిన గుంటూరు జిల్లా కలెక్టర్, ఎస్పీ
- ఫిర్యాదులకు కంట్రోల్ రూం నంబర్ 0863-2234301



కొల్లిపర మండలం మున్నంగి ఇసుక రీచ్‌లో జిల్లా అధికారులతో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

తెనాలి: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో ఇసుక తవ్వకాలు జరగకుండా సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నిబంధనలు మీరితే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. ఆయన సోమవారం ఎస్పీ తుషార్ డూడీ, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలిసి కొల్లిపర మండలంలోని ఇసుక రీచ్‌లను తనిఖీ చేశారు. మండలంలోని బొమ్మువానిపాలెం 14, 15 ఇసుక రీచ్‌లు, మున్నంగిలోని ఇసుక రీచ్‌లను అధికారులు పరిశీలించారు. తాడేపల్లి మండలంలోని గుండెమెడ ఇసుక రీచ్‌నూ తనిఖీ చేశారు. ఎన్జీటీ నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో తవ్వకాలు జరపరాదని, అనుమతులు పొందిన ప్రాంతంలోనే మనుషులతో తవ్వకాలు జరపాలని ఆదేశించారు. దీనిపై నిరంతరం మైనింగ్ శాఖ అధికారులతోపాటు పోలీస్, రెవిన్యూ, శాండ్ కమిటీలోని ఇతర శాఖల అధికారులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. దీనికోసం రెండు షిఫ్టులుగా బృందాలను నియమించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నట్టు గుర్తించిన వెంటనే పోలీస్ అధికారులు కేసులు నమోదుచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తేల్చిచెప్పారు.

కలెక్టరేట్‌లో ఇసుక కమిటీతో సమావేశం

అంతకుముందు కలెక్టరేట్‌లోని ఏసీ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సభ్యులతో కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్ సమావేశమయ్యారు. జిల్లాస్థాయి సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ కమిటీ ఏర్పాటైందని, ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా అందరూ సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతివారం రీచ్‌లను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని చెప్పారు. కమిటీలోని శాఖలు క్షేత్రస్థాయిలో అధికారులతో ప్రత్యేకంగా ఇంటిగ్రేటెడ్ బృందాలను ఏర్పాటుచేయాలని సూచించారు. ఇసుక అక్రమ తవ్వకాలపై జిల్లాస్థాయిలో కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్ నంబర్ 0863-2234301తోపాటు ఈ-మెయిల్ dirmc2024@fmai.comకు కూడా ఫిర్యాదులను పంపవచ్చని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీకర్, తనిఖీల్లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ కన్వీనర్, మైనింగ్ శాఖ డీడీ చంద్రశేఖర్, జిల్లా ఎస్ఈబీ సూపరింటెండెంట్ ఎల్.రంగారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి, భూగర్భ జలవనరులశాఖ డెప్యూటీ డైరెక్టర్ వందనం, ఎన్విరాన్మెంట్ ఇంజినీరు నారాయణ, జిల్లా ఉప రవాణా కమిషనర్ కరీం, ఆర్‌డబ్ల్యుస్ ఈఈ కళ్యాణ చక్రవర్తి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాలు పెంచుకోవాలి

ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి

గుంటూరుఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను పెంచుకోవాలని ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సీబీఎస్ఈ బోధనపై గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని ఉపాధ్యాయులకు చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. గణిత, భౌతిక, రసాయనశాస్త్ర పాఠ్యాంశాలను బోధించే ఉపాధ్యాయులకు రవీంద్రనాథ్‌రెడ్డి సూచనలు, సలహాలు ఇచ్చారు. సాంకేతిక బోధనా పద్ధతులను అలవర్చుకోవాలని చెప్పారు. డీఈఓ పి.శైలజ మాట్లాడుతూ సీబీఎస్ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న ఇంగ్లిషు, సోషల్, బయాలజీ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు ఇటీవల రెండు రోజుల పాటు శిక్షణ విజయవంతంగా పూర్తిచేశామన్నారు.

పెట్రోల్ బంకుల్లో విడిగా పెట్రోల్ అమ్మరాదు

పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు

పిడుగురాళ్ల: ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు పెట్రోల్ బంకుల్లో విడిగా బాటిళ్లలో పోయరాదని ఆదేశాలు వచ్చాయని పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు తెలిపారు. గ్రామాల్లో బడ్డీ దుకాణాల్లో ప్లాస్టిక్ బాటిళ్లల్లో అమ్మకాలు చేస్తుంటారని, అటువంటివి నిర్వహించరాదని తెలిపారు. అమ్మకాలు జరిపిన వారిపై కూడా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నెంబర్ ప్లేట్ లేకుండా తిరిగే వాహనాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేస్తామని చెప్పారు. వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, లైసెన్స్ లేకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనదారులు వాహనానికి సంబంధించిన రికార్డులను తమ వెంట ఖచ్చితంగా ఉంచుకోవాలని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినవారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. పట్టణంలో ర్యాష్ డ్రైవింగ్ చేసిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పిడుగురాళ్ల పట్టణం, మండలంలోని ప్రజలంతా ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ వారికి సహకరించాలని కోరారు. లేకుంటే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

పెట్రోల్ బంకుల నిర్వాహకులకు నోటీసులు

నకరికల్లు: పెట్రోల్ బంకులలో బాటిళ్లు, సీసాలలో పెట్రోల్, డీజిల్ విక్రయించవద్దని ఎస్ఐ పి.రాంబాబు ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పెట్రోల్ బంకుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చోటుచేసుకుంటున్న ఘర్షణల దృష్ట్యా శాంతిభద్రతలు నెలకొల్పేందుకు ప్రజలు అన్నివిధాలా సహకరించాలని కోరారు. బంకుల్లో, చిరువ్యాపారుల వద్ద లూజుగా పెట్రోల్, డీజిల్ అమ్మకాలు నిషేధిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ లత్కర్ శ్రీకేష్ బాలాజీ ఆదేశాల మేరకు జూన్ 5వ తేదీ వరకు పల్నాడు జిల్లాలో 144 సెక్షన్ కొనసాగుతుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు వాటిల్లకుండా చేస్తున్న ప్రయత్నంలో ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు.

టీడీపీ నేతలపై అట్రాసిటి కేసులు

అచ్చంపేట: ఈనెల 13న జరిగిన ఎన్నికలలో అలజడులకు పాల్పడిన పలువురు టీడీపీ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసినట్లు అచ్చంపేట సీఐ షేక్ కరిముల్లా షావలి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని చింతపల్లి, కొత్తపల్లి, వేల్పూరు గ్రామాలలో కొందరు టీడీపీ చెందిన అగ్రవర్ణాల వారు ఎస్సీ కాలనీలపై దాడులు నిర్వహించి తీవ్రంగా గాయపరచినట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశామన్నారు. కొత్తపల్లిలో వైఎస్సార్ సీపీకి చెందిన చిలాక యాకోబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీడీపీకి చెందిన రంగిశెట్టి నరసింహారావు, కూకట్లపల్లి అయ్యపరాజులతోపాటు మరో 9మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశామన్నారు. ఇదే గ్రామంలో టీడీపీకి చెందిన రంగిశెట్టి నవీన్ ఫిర్యాదు మేరకు వైఎస్సార్ సీపీకి చెందిన తేళ్లూరి వెంకటరామిరెడ్డి, మార్కపూడి దేవదానంతోపాటు మరో అయిదుగురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేశామన్నారు. వేల్పూరులో వైఎస్సార్ సీపీకి చెందిన సందెపోగు మాణిక్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీడీపీకి చెందిన పొన్నెకంటి వంశీ, పొన్నెకంటి శివనాగ మల్లేశ్వరరావు మరో ఆరుగురు టీడీపీ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశామన్నారు. చింతపల్లిలో వైఎస్సార్ సీపీకి చెందిన చిలకా పెద ఇస్సాక్ ఫిర్యాదు మేరకు టీడీపీకి చెందిన బత్తుల శ్రీనివాసరావు, బత్తుల వెంకటేశ్వర్లు, మరో నలుగురు టీడీపీ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇదే గ్రామానికి చెందిన టీడీపీ నేత పేరుబోయిన పుల్లారావు ఫిర్యాదు మేరకు వైఎస్సార్ సీపీకి చెందిన చిలకా పెద ఇస్సాకు, కొంపెర్ల రోశయ్యలతోపాటు మరో అయిదుగురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ కరిముల్లాషావలి తెలిపారు.

గ్రామాల్లో తనిఖీలు ముమ్మరం

శావల్యాపురం: గ్రామాల్లో అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చల్లా సురేష్ హెచ్చరించారు. మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో పోలీసులు సోమవారం సోదాలు నిర్వహించారు. ప్రతి ఇంటిని జల్లెడ పట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల అనంతరం గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఉండటానికి ఈ సోదాలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామ ప్రజలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అల్లర్లకు పాల్పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, ముఖ్యంగా యువత ఇటువంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. సరైనా పత్రాలు లేని ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఐనవోలు స్టేషన్ ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బొందిలిపాలెంలో గడ్డివామిలో సోదాలు చేస్తున్న పోలీసులు

బలుసుపాడులో కార్డన్ సెర్చ్

పెదకూరపాడు: మండలంలో అత్యంత సమస్యాత్మక గ్రామమైన బలుసుపాడు గ్రామంలో పెదకూరపాడు ఎస్సై వెంకట్రావు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో సమస్యాత్మకమైన గ్రామాలలో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. పెట్రోలు బంకుల్లో బాటిళ్లు, క్యాన్లలో పెట్రోలు పోయకూడదని, ఎవరైనా అలా తరలిస్తుంటే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల వచ్చేంత వరకు ముమ్మరంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

ద్విచక్రవాహనాలు స్వాధీనం

వినుకొండ(నూజెండ్ల): కార్డన్ సెర్చ్‌లో భాగంగా నూజెండ్ల మండలం పమిడిపాడు గ్రామంలో 9 ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. త్వరలో ఎన్నికల ఫలితాలు రానున్న సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కొన్ని రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో ఐనవోలు పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా సరైన పత్రాలు లేని తొమ్మిది ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వినుకొండ రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో శావల్యాపురం ఎస్ఐ సీహెచ్.సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలలో పోలీస్ పికెట్

అమరావతి: ఈనెల 13 జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరిగిన హింసాత్మక సంఘటనలను పురస్కరించుకుని మండల పరిధిలోని పలు అతి సమస్యాత్మక గ్రామాలలో ముందు జాగ్రత్త చర్యగా పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ ఎ.వి బ్రహ్మం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని నరుకుళ్లపాడు, దిడుగు, ఉంగుటూరు, లింగాపురం గ్రామాలలో ఉన్నతాధికారుల సూచనల మేరకు పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. మరికొన్ని గ్రామాలపైన ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలలో ఇంటింటికి తిరిగి కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. మండలంలో పెట్రోలు బంకులలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బాటిళ్లకు పెట్రోలు పోయటం నిషేధించామని, ఇప్పటికే పెట్రోలు బంకుల యాజమాన్యాలకు ప్రత్యేక సూచనలు ఇచ్చామన్నారు. ఇందుకు విరుద్ధంగా బాటిళ్లకు పెట్రోలు పోస్తే బంకును సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

తొండపిలో విస్తృత తనిఖీలు

తొండపి(ముప్పాళ్ల): మండలంలోని తొండపి గ్రామంలో పోలీసులు సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగిన దాడుల నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమానాస్పద గృహాల్లో పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని, 144 సెక్షన్ కూడా అమలులో ఉందని, నలుగురు వ్యక్తులు గుమికూడి ఉండరాదని హెచ్చరించారు. పెట్రోలు బంక్ యజమానులు కూడా డబ్బాల్లో పెట్రోలు పోస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించి, గ్రామాల్లో శాంతిభద్రతలకు నెలకొనేలా సహకరించాలన్నారు.



బలుసుపాడు గ్రామంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు



వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు



ఉంగుటూరులో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్

కొత్త బోధనంలో తనిఖీలు

రాజుపాలెం: మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలలో సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్‌బాబు ఆదేశాల మేరకు పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సోమవారం కొత్తబోధనం(ఆర్అండ్ఆర్ సెంటర్)లో ఎస్ఐ షమీర్ బాషా తన సిబ్బందితో గ్రామాలలో అనుమానాస్పదంగా ఉన్న గృహాలలో తనిఖీలు నిర్వహించారు. గేదెల కొష్టాలను, గడ్డివాములను, దొడ్లలో సోదాలు నిర్వహించారు. ఎలాంటి మారణాయుధాలు దొరకలేదు. అనుమానితులను పిలిచి గ్రామాలలో అల్లర్లు సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

పోలీసు అధికారుల నియామకం

నరసరావుపేట: ఎన్నికల సందర్భంగా జిల్లాలో చోటుచేసుకున్న హింసాత్మక సంఘటనలకు బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేసిన అధికారుల స్థానంలో నూతన అధికారులను నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పల్నాడు దిశ డీఎస్పీగా పనిచేస్తున్న ఎం.సుధాకరరావును నరసరావుపేట డీఎస్పీగాను, ఏసీబీకి అటాచ్‌చేసిన కాకినాడ ఎస్సీ, ఎస్టీ సెల్ అధికారి సీహెచ్.శ్రీనివాసరావును గురజాల డీఎస్పీగా నియమించారు. పల్నాడు ఎస్‌బీ సీఐలుగా బండారు సురేష్‌బాబు, యు.శోభన్‌బాబు, కారంపూడి ఎస్ఐగా కె.అమీర్, నాగార్జునసాగర్ ఎస్ఐగా ఎం.పట్టాభిని నియమించారు. వీరిలో కొందరు అధికారులు నూతన జిల్లా ఎస్పీ మలికా గార్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నరసరావుపేట డీఎస్పీగా బాధ్యతల స్వీకారం



నరసరావుపేటటౌన్: నరసరావుపేట డీఎస్పీగా ఎం.సుధాకరరావు సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన వీఎస్ఎన్ వర్మ ఎన్నికల సందర్భంగా చెలరేగిన హింసా సంఘటనలకు బాధ్యులను చేస్తూ ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసింది. ఆయన స్థానంలో పల్నాడు జిల్లా దిశ డీఎస్పీగా పనిచేస్తున్న సుధాకరరావును నియమించింది. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని చెప్పారు.

మాచర్లలో కొనసాగుతున్న 144 సెక్షన్

- భారీ సంఖ్యలో పోలీసుల పహారా
- పలు ఇళ్లల్లో సోదాలు

మాచర్ల: మాచర్ల పట్టణంతోపాటు పలు ప్రాంతాల్లో 144 సెక్షన్ సోమవారం కూడా అమలుచేశారు. ఎన్నికల నేపథ్యంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో జిల్లా పోలీసుల ఉన్నతాధికారులు 144 సెక్షన్ అమలు చేస్తున్న విషయం విదితమే. పట్టణంలో టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎక్కడికక్కడ వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. నిబంధనలు పాటించని వాహనదారులపై జరిమానాలు విధిస్తున్నారు. అక్కడక్కడ చిన్న చిన్న సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం స్పందిస్తుంది. పట్టణంలో పలు ఇళ్లల్లో రెండు రోజులుగా తనిఖీలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లల్లో తనిఖీలు చేశారు. ప్రముఖ నాయకుల ఇళ్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఇళ్ల వద్ద బందోబస్తు ఏర్పాటుచేశారు. రింగ్‌రోడ్డు సెంటర్, పాలవాయి జంక్షన్, గుంటూరు రోడ్డు, నెహ్రూనగర్, అంబేడ్కర్ సెంటర్, బస్టాండ్ సెంటర్, తూర్పు బావి తదితర ప్రాంతాల్లో పోలీసులు మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

బాలికల ఆశ్రమ పాఠశాలలో చేరికకు దరఖాస్తుల ఆహ్వానం

వెల్దుర్తి: పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు గ్రామంలో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల హెచ్ఎం పి పద్మ కోరారు. సోమవారం ఆమె ఐటీడీఏ పాఠశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2024-25 విద్యా సంవత్సరంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో చేరేందుకు 21-05-2024 నుంచి 30-05-2024 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ పాఠశాలలో అన్నీ తరగతులకు ఎస్టీ బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

బీసీలు 3వ తరగతికి ఆరుగురు, 4వ తరగతిలో ఆరు, ఎస్సీలు 3వ తరగతికి ఆరుగురు, 4వ తరగతిలో ఆరు, 5వ తరగతిలో ఐదు, ఓసీలు 3వ తరగతికి ఆరుగురు, 4వ తరగతిలో ఆరుగురు, 5వ తరగతిలో మూడు, 7వ తరగతిలో నాలుగు సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హులైన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

జిల్లా ఎస్సీ,ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షుడిగా భాస్కరరావు



క్రోసూరు: పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షుడిగా అచ్చంపేట మండలం గ్రంధసిరి గ్రామానికి చెందిన చిలకా భాస్కరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు నియామకపత్రాన్ని భాస్కరరావుకు అందజేశారు. రాజారావు మాట్లాడుతూ జిల్లా ఎస్సీ, ఎస్టీ ప్రజల హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమాలు, న్యాయపరమైన సలహాలు అందించేందుకు కృషి చేసే బాధ్యతలను భాస్కరరావుకు అప్పగించినట్లు తెలిపారు. భాస్కరరావు స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ ప్రజలకు అన్ని రకాలుగా సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

కౌన్సిలర్ ద్విచక్రవాహనం దహనం చేసిన దుండగులు



మాచర్ల: మాచర్ల పదో వార్డు కౌన్సిలర్ మహంకాళి పిచ్చయ్య ఇంటి ముందు ఉన్న ద్విచక్రవాహనాన్ని సోమవారం ఉదయం గుర్తు తెలియని దుండగులు దహనం చేశారు. ఇది గమనించిన ఓ వృద్ధురాలు కేకలు వేసింది. మహంకాళి పిచ్చయ్య వెంటనే బయటకు వచ్చి నీళ్లు చల్లి మంటలు అదుపు చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ పశువుల ఆసుపత్రి వెనుక ఉన్న కౌన్సిలర్ ఇంటి ముందు ఉంచిన వాహనాన్ని దహనం చేయడం చర్చనీయాంశంగా మారింది. కౌన్సిలర్ పిచ్చయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఎవరు చేశారనే దానిపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. పట్టణంలో ఉద్రిక్తతల నేపథ్యంలో పోలీసుల బందోబస్తు ఉన్నప్పటికీ ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం భయాందోళనలకు గురిచేస్తుంది.

మానసిక వైద్యుల సంఘం

గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ వడ్డాది



డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్

గుంటూరుమెడికల్: మానసిక వ్యాధి వైద్య నిపుణుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సెక్రటరీగా డాక్టర్ పసుపుల సాయికిరణ్, కోశాధికారిగా డాక్టర్ నెక్కంటి నిమిషా ఎన్నికయ్యారు. గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్, మిగతా ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు. జాయింట్ సెక్రటరీగా డాక్టర్ జి.జగదీష్ ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గాన్ని సోమవారం గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల విభాగాధిపతి డాక్టర్ నీలి ఉమాజ్యోతి, పలువురు మానసిక వ్యాధి వైద్య నిపుణులు అభినందించారు. మానసిక సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించి వ్యాధుల బారిన పడకుండా చైతన్యం కల్పిస్తామని డాక్టర్ వడ్డాది తెలిపారు.

సీఐ నారాయణస్వామిపై చర్యలు తీసుకోండి

ఎస్పీకి తుమ్మకోట గ్రామస్తుల ఫిర్యాదు



ఎస్పీని కలిసేందుకు వచ్చిన తుమ్మకోట గ్రామస్తులు

నరసరావుపేట: ఎన్నికల్లో తమను ఓట్లు వేయనీయకుండా అడ్డుకున్న టీడీపీ వర్గీయులకు సీఐ నారాయణ స్వామి కొమ్ముకాస్తూ తమను బెదిరిస్తున్నాడని రెంటచింతల మండలం తుమ్మకోట గ్రామస్తులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పోట్ల ముత్తయ్య, శ్రీనివాసరావు, షేక్ మహమద్‌ఖాసీం, జంగాల కోటేశ్వరరావుతోపాటు సుమారు 20మంది గ్రామస్తులు తమకు జరిగిన అన్యాయాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీలకు చెప్పుకునేందుకు కార్యాలయాల వద్దకు వచ్చారు. ఎస్పీ కార్యాలయం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ తమ తుమ్మకోట గ్రామంలో సుమారు 4,500 ఓట్లు ఉండగా సుమారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన 1000 మందిని ఓట్లు వేయనీయకుండా క్యూలో నిల్చున్న తమపై దాడిచేసి తరిమివేశారన్నారు. పోలింగ్ బూత్‌ల వద్దకు రానీయలేదన్నారు. తమపై కర్రలు, రాడ్లతో చేసిన దాడికి గాయాలపాలై నరసరావుపేటలో చికిత్స పొందుతుండగా తమపై సీఐ నారాయణస్వామి తప్పుడు కేసులు పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. తమపై జరుగుతున్న దౌర్జన్యాన్ని గురించి ఎస్ఐ నారాయణరెడ్డికి చెప్పినా ఫలితం లేకుండా పోయిందన్నారు. తమపై దౌర్జన్యం చేస్తున్న సీఐ నారాయణస్వామిపై చర్యలు తీసుకొని మళ్లీ రీ పోలింగ్ నిర్వహించాలని కోరారు. తాము సిట్ దర్యాప్తు సంస్థ అధికారులకు కూడా తమ ఆవేదన వెల్లడించామన్నారు.

ఈదురుగాలుల బీభత్సం



నకరికల్లు: మండలంలో సోమవారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలులు వీచడంతోపాటు భారీ వర్షం కురిసింది. ఈదురుగాలుల ధాటికి చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. పలుచోట్ల విద్యుత్ తీగలు తెగి స్తంభాలు విరిగిపడ్డాయి. పలుగ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.